andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7 : కనిష్ఠం 27.3
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 14 జూన్ 2025







ఏఐ టెక్నాలజీతో భూసార పరీక్షలు

- పరీక్షల బాధ్యత మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు
- నిర్మల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు
- బెంగళూరు నుంచి ప్రత్యేక పరికరం కొనుగోలు
- మట్టి నమూనా పరీక్షల ఆధారంగా దేశీయ విత్తనాలతో సాగు

నిర్మల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో రోజురోజుకు రసాయనిక ఎరువులు, పెస్టిసైడ్స్ వినియోగం పెరిగిపోతున్న కారణంగా భూసారం పూర్తిగా నశిస్తుండడంతో పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. అయితే భూసార పరీక్ష కేంద్రాల ద్వారా మట్టి నమూనా పరీక్షలు ఆశించిన రీతిలో జరగకపోతుండడం, అలాగే భూసార పరీక్షలపై రైతులకు సరైన అవగాహన లేకపోతుండడం దిగుబడులపై ప్రభావాన్ని చూపుతోంది. ప్రస్తుతం ఉన్న మట్టి నమూనా పరీక్షా కేంద్రాల్లో ఆధునిక పరికరాలు అందుబాటులో లేకపోవడం అలాగే అక్కడ సిబ్బంది ఆశించిన సంఖ్యలో లేకపోవడంతో లక్ష్యానికి అనుగుణంగా మట్టి నమూనా పరీక్షలు జరగడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ భూసార పరిరక్షణతో పాటు సాంప్రదాయ విత్తనాల పెంపుదల కోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రయోగాత్మకంగా ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగిస్తూ భూసార పరీక్షలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. దీనికోసం గాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కూడిన మట్టి నమూనాను పరీక్షించే ఓ పరికరాన్ని బెంగళూరు నుండి జిల్లాకు తెప్పించారు. జిల్లాలో ఇక ఏఐ టెక్నాలజీతో భూసార పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.



మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు బాధ్యతలు

కాగా ఏఐ టెక్నాలజీతో కూడిన పరికరంతో చేపట్టబోయే భూసార పరీక్షలకు సంబంధించిన బాధ్యతలను జిల్లాలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులకు అప్పజెప్పనున్నారు. వీరి ఆధ్వర్యంలో భూసార పరీక్షా కేంద్రాల సాంకేతిక నిపుణులు ఈ పరికరంతో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉండగా ఇందులో మొత్తం 2000ల మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు. దశలవారీగా ఈ పరికరంతో మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షణలో ఇక మట్టి నమూనా పరీక్షలను నిర్వహించనున్నారు.

మట్టి నమూనా పరీక్షల ఆధారంగా దేశీయ విత్తనాల సాగు

ఏఐ టెక్నాలజీతో చేపట్టనున్న మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఇక నుండి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు దేశీయ సాంప్రదాయ విత్తనాల సాగును చేపట్టనున్నారు. దేశీ సీడ్ కార్యక్రమం పేరిట వరి, నువ్వులు, కందులు, జొన్న, కూరగాయల విత్తనాలను సేంద్రియ విధానంలో సాగు చేయనున్నారు. ఇప్పటికే 200ల మంది మహిళా రైతులు ఏఐ టెక్నాలజీతో నిర్వహించే మట్టి నమూనా పరీక్షల ఆధారంగా దేశీయ సాంప్రదాయ విత్తనాలను సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. కాగా ఈ విత్తనాలను మహారాష్ట్రలోని సోలాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి జిల్లాల నుండి జిల్లాకు తీసుకురానున్నారు.

రైతులను మోసం చేసి

డబ్బులతో పారిపోయిన నిందితుడి అరెస్టు

- రూ. 9 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) ; వ్యవసాయోత్పత్తులు కొనుగోలు చేసి అందుకు సంబంధించిన డబ్బులు చెల్లించకుండా రైతులను మోసగించి పారిపోయిన నిందితుడు సంగి శ్రీనివాస్ (34)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం భైంసా పట్టణ పోలీసుస్టేషన్‌లో రూరల్ సీఐ నైలూ, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కుబీర్ మండల కేంద్రానికి చెందిన సంగి శ్రీనివాస్ కుబీర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్నాడు. జల్సాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఆయన సీఈఓ హోదాలో కుబీర్ మండలంలోని ఏడుగురు రైతుల వద్ద, లోకేశ్వరం మండలంలోని 32 మంది రైతుల వద్ద జొన్న, మొక్కజొన్న, సోయా దిగుబడులను కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి చెల్లింపుల కోసం గాను రైతులకు చెక్కులను అందజేశారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన దిగుబడులను భైంసాలోని ఇంటిదీపం మ్యాక్స్ సొసైటీకి విక్రయించి వారి వద్ద నుంచి నగదు రూపంలో, ఆన్‌లైన్ విధానంలో డబ్బులను తీసుకున్నాడు. అయితే ఇట్టి డబ్బులను రైతులకు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతు మోసానికి పాల్పడ్డాడు. సీఈఓ సంగి శ్రీనివాస్ అందజేసిన చెక్కులు బ్యాంక్‌లలో బౌన్స్ కావడంతో మోసపోయినట్లు గ్రహించిన రైతులు సంబంధిత విషయంలో కుబీర్, లోకేశ్వరం పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. సంబంధిత కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ డా.జానకీషర్మిల ఆదేశాల మేరకు మూడు పోలీసు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకునేందుకు గాలింపుచర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం కుబీర్ మండలంలోని పార్డి (బి) క్రాస్ రోడ్డు సమీపంలో నిందితుడిని పట్టుకున్నట్లుగా తెలిపారు. అతని వద్ద గల రూ. 9లక్షలను స్వాధీనం చేసుకుని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. కుబీర్, లోకేశ్వరం మండలాల్లోని 39 మంది రైతులకు సుమారు రూ. 53లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. త్వరలోనే నిందితుడిని పోలీసుకస్టడీకి తీసుకుని పూర్తి స్థాయి విచారణ చేపడుతామని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో విచారణలో చాకచాక్యంగా వ్యవహరించిన భైంసా రూరల్ సీఐ ఎం. నైలూ, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డిలతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో కేసు చేధనలో ప్రధాన భూమిక పోషించిన ఐటీ కోర్ నిర్మల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలా ప్రత్యేక అభినందించినట్లుగా ఏఎస్పీ తెలిపారు.

ప్రపంచంలో ఎత్తైన కిలిమంజారో

పర్వత శిఖరాన్ని అధిరోహించిన జిల్లా వాసి

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్‌కు చెందిన (సీఏ) చార్టెడ్ అకౌంటెంట్ ముక్క సాయి ప్రసాద్ ఈ నెల 11న ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో గల కిలిమంజారో పర్వతాన్ని ఆయన అధిరోహించారు. 2023లో ఆయన ఎవరెస్టు బేస్‌క్యాంపు వరకు అధిరోహించారు. తాజాగా కిలిమంజారో శిఖరాన్ని సైతం ఆయన అధిరోహించడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కిలిమంజారో పర్వతం మీద ముక్క సాయిప్రసాద్

జూనియర్ కళాశాలను

సందర్శించిన ఇంటర్ బోర్డ్ స్పెషల్ అధికారి



అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న ఇంటర్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్

దిలావర్‌పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచడం, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యాపకుల పనితీరును పరిశీలించేందుకు ఇంటర్మీడియట్ బోర్డ్ నియమించిన జిల్లా స్పెషల్ అధికారి ఎల్. భీమ్‌సింగ్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురామ్‌తో కలిసి దిలావర్‌పూర్ ప్రభుత్వ కళాశాలను శుక్రవారం సందర్శించారు. కళాశాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరం కంటే 30 శాతం అడ్మిషన్లు పెంచాలని సూచించారు. కేటాయించిన టార్గెట్ ప్రతీ అధ్యాపకుడు పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం దిలావర్‌పూర్ కళాశాల అడ్మిషన్లసంఖ్య 148 కాగా మరిన్ని అడ్మిషన్లు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి. ఆనందం, సత్యపాల్ రెడ్డి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

లోకేశ్వరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలు చేస్తున్నాడని అనుమానంతో గడ్డం పోసులును సిమెంటు ఇటుకతో కొట్టి చంపిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. శుక్రవారం లోకేశ్వరం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో గడ్డం గంగాధర్, గడ్డం సాయిలును పట్టుకొని రిమాండ్‌కు తరలించామని ముథోల్ సీఐ జి. మల్లేష్, లోకేశ్వరం ఎస్సై జి. అశోక్ కుమార్ తెలిపారు. నిందితులను హత్య చేసిన 12 గంటల లోపు పట్టుకొని రిమాండ్‌కు తరలించిన లోకేశ్వరం పోలీస్ సిబ్బందిని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం



తానూర్ , జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఎంపీడీవో నసీరొద్దీన్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, కారోబారి నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ మాధవ్‌రావుపటేల్, షేకల్‌లాల్‌పాషా, నాయకులు బి. మాదవరావు, సాయినాథ్, అల్తాఫ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలి

- శిథిల భవనాల కూల్చివేతకు తక్షణ చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేలా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బడిబాట, శిథిల పాఠశాల భవనాల గుర్తింపు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టే ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేలా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరం అంగన్‌వాడీ విద్య పూర్తి చేసిన పిల్లలందరినీ సమీప ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో విద్యార్థుల ప్రవేశ శాతం పెంపుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాల గుర్తింపు, బడిబాట కార్యక్రమం అమలుపై మండలాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల వారీగా డ్రాప్ అవుట్ విద్యార్థుల సమాచారం సేకరించి, ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో చర్చించి, పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 163 పాఠశాలల్లో 302 తరగతుల గదులు శిథిలావస్థకు చేరినట్లు గుర్తించామని, అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల కూల్చివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా శిథిల భవనాల వివరాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రారంభ దశ నుంచే ప్రజలకు మొక్కలు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలలోని ఖాళీ ప్రదేశాలు, చెరువుల గట్లు, ప్రాజెక్టులు, చెరువుల కాలువలు, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది నిరంతరం గ్రామాలను సందర్శిస్తూ వ్యాధుల నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఈవో రామారావు, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎం అండ్ హెచ్‌వో రాజేందర్, ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

దస్తురాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజల భూ సమస్యలను అధికారులే ప్రత్యక్షంగా గ్రామాలకు వచ్చి స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిన తరువాత భూ రికార్డుల పరంగా ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులను సదస్సుల సందర్భంగా సమర్పించాలని, వాటిని అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారని వివరించారు. దరఖాస్తులన్నింటినీ రిజిస్టర్లలో నమోదు చేసి, అభ్యర్థులకు రసీదులు అందించాలని అధికారులకు సూచించారు. సదస్సులకు హాజరయ్యే అధికారులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, ఆర్ఐ ఆర్తి, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

మొబైల్ ఫోన్ చోరీకి గురైతే సీఈఐఆర్ ద్వారా పొందవచ్చు

- ఎస్పీ జి.జానకీషర్మిల
- జిల్లా పరిధిలో పోగొట్టుకున్న 88 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 88 మొబైల్ ఫోన్లు (సుమారుగా పది లక్షల యాభై ఆరు వేల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్‌ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,416 ఫోన్లు (సుమారుగా కోటి అరవై తొమ్మిది లక్షల తొంబై రెండు వేల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, సీఈఐఆర్ టీం కానిస్టేబుల్ నరేందర్, ప్రత్యూష, సూర్యవంశీ, రాం పవన్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ఐపీఎస్‌తో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి సమ్మయ్య, ఆర్ఐలు రాం నిరంజన్ రావు, శేఖర్, ఆర్ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



సోన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగంపేట్ గ్రామానికి చెందిన గజ్జల రమేష్ అనే వ్యక్తి ఈ నెల 10వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో తన ఇంటి నుండి మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లాడు. తన భర్త ఇంటికి తిరిగి రాలేదని, తన గురించి బంధువుల ఇళ్లల్లో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికిన ఆచూకీ లభించలేదని అతని భార్య గజ్జల లక్ష్మీ శుక్రవారం సోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోన్ ఎస్సై గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : శనివారం విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు పత్రికా ప్రకటనలో తెలిపారు. నిర్మల్ టౌన్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఓల్డ్ బస్టాండ్, బుధవార్‌పేట్, నగేశ్వరవాడ, బాగులవాడ, కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, జోహర్‌నగర్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ప్రియదర్శినినగర్, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా, డాక్టర్స్ లైన్, కస్బా, కమల్ టాకీస్, రోయల్ బిల్డింగ్, చింతకుంటవాడ, గాంధీచౌక్, ద్యాడవాగ, పింజారిగుట్ట, చిక్కడపల్లి, ఇంద్రానగర్, గొల్లపేట్, శాస్త్రినగర్, చైన్‌గేట్, మదీనా కాలనీ, ఇరిగేషన్ ఆఫీస్, సాగర్ కాలనీ, భాగ్యనగర్, రాంనగర్, ఆస్రా కాలనీ, ఎన్టీఆర్ మార్గ్, బోయవాడ, నటరాజ్ నగర్, మొదలైన ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

33/11 ఆదర్శనగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా 11 కేవీ సోఫీనగర్, 11 కేవీ ఆదర్శనగర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సోఫీనగర్, కేజీబీవీ గురుకుల హాస్టల్, ఇందిరమ్మకాలనీ, డి మార్ట్, సాగర్ కన్వెన్షన్, సిద్దాపూర్ వాటర్ వర్క్స్, ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్దాపూర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రాంపూర్‌లో కిరాణాషాపు నుంచి ఐ ఫోన్ చోరీ

నర్సాపూర్(జి), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్ గ్రామంలోని ఒక కిరాణా షాపులో ఐ ఫోన్ చోరీకి గురైంది. శుక్రవారం ఉదయం జరిగిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి షాపు యజమాని దృష్టి మళ్లించి సుమారు లక్ష రూపాయల విలువైన ఐఫోన్‌ను దొంగలించుకుపోయాడు. రాంపూర్ గ్రామానికి చెందిన ప్రణీత్ తన కిరాణాషాపును నడుపుతున్నాడు. ఉదయం ఒక గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై షాపు వద్దకు వచ్చాడు. అతను ప్రణీత్‌ను కొన్ని వస్తువులు ఇవ్వమని కోరగా ప్రణీత్ షాపు లోపలికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగ షాపు టేబుల్‌పై ఉన్న ప్రణీత్ ఐఫోన్‌ను చాకచక్యంగా దొంగలించాడు. ఐఫోన్ దొంగలించిన వెంటనే తన వెంట తెచ్చుకున్న మోటార్ సైకిల్‌పై వేగంగా అక్కడి నుంచి పారిపోయాడు. దొంగలించబడిన ఐఫోన్ విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని ప్రణీత్ నర్సాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికిరణ్ ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. దొంగను పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కిరాణాషాపు యజమానులు తమ వస్తువుల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని

స్కూల్ బస్సులపై ఆర్‌టీవో అధికారుల కొరడా



భైంసాలో ప్రైవేటు స్కూల్ బస్సును సీజ్ చేస్తున్న ఎంవీఐ డూప్‌సింగ్

భైంసా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోకుండా విద్యార్థులను చేరవేస్తున్న స్కూల్ బస్సులపై ఆర్‌టీవో అధికారులు కొరడా ఝులిపించారు. శుకవారం భైంసా పట్టణ ప్రవేశ మార్గాల్లో తనిఖీలు చేపట్టిన ఆర్‌టీవో అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని రెండు ప్రైవేటు పాఠశాలల బస్సులను పటుకున్నారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోకుండా స్కూల్ యాజమాన్యాలు బస్సులను నడిపిస్తున్న దృష్ట్యా ఆర్టీఏ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బెల్‌తరోడ ఆర్టీఏ చెక్ పోస్టు ఎంవీఐ డూప్‌సింగ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో రెండు పాఠశాలలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్ లేకుండా విద్యార్థులను చేరవేస్తున్నట్లు గుర్తించిన ఆర్టీఏ అధికారులు సంబంధిత బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ డూప్‌సింగ్ మాట్లాడుతూ విద్యా సంస్థల యాజమాన్యాలు జాప్యపు విధానాలను అవలంబించకుండా తమ తమ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోవాని సూచించారు. లేని పక్షంలో సంబంధిత బస్సులను సీజ్ చేస్తామని వెల్లడించారు.

బరంపూర్ వేంకటేశ్వర ఆలయంలో
ఆదివాసీ పిల్లల సామూహిక అక్షరభ్యాసం



బరంపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఆదివాసీ పిల్లలకు సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

తలమడుగు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఝరి పునాగూడ ఆశ్రమ పాఠశాలలకు చెందిన ఆదివాసీ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు సరస్వతి మాట్లాడుతూ ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు కొత్తగా పాఠశాలలో చేరే విద్యార్థులందరికీ అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించామన్నారు. కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర రెడ్డి, ఆలయ పూజారి తిరుమలగిరి స్వస్తిక్ స్వామి, ఉపాధ్యాయులు దివాకర్, ఎస్ఆర్పి అశోక్, గ్రామస్థులు మల్లేష్, నాగరెడ్డి, రాజు, తదితరులున్నారు.

భీంపూర్: విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తహసీల్దార్ నలంద ప్రియ అన్నారు. శుక్రవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాడ్గాం గ్రామంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలబాలికల చేత అక్షరాలను చదివించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేల చూడాలన్నారు. అలాగే మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మడావి లింబాజి, రవీందర్ జాదవ్, సీడం అశోక్‌లు కలిసి నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఉపాధ్యాయులు సప్తగిరి, జయశరథిలు ఉన్నారు.



.. సాలెవాడ(బి) పాఠశాలలో హెచ్‌ఎం జాదవ్ చంద్రకాంత్

ఉట్నూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలల్లో చేర్పించుకున్న నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సాలెవాడ(బి) గ్రామానికి చెందిన మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాదవ్ చంద్రకాంత్ నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా నమోదైన ఒకటవ తరగతి విద్యార్థులకు అక్షర అభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఎత్మబాయి గ్రామపెద్దలు మరప బాజీరావు ఉపాధ్యాయులు మేస్రం కృష్ణ, కిరణ్‌మై, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీబాయి, భగవంతరావు, శేశరావు, వచ్చాలబాయి, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఘనపూర్ పాఠశాలలో మాజీ ఎంపీపీ పంద్రాజయమంత్రం ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని చాందూరి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోనూ అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మాజీ సర్పంచ్ రఘునాథ్, మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్‌పప్పుల్వాడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్‌గోకుల్ పాల్గొన్నారు. అలాగే హస్నాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బానోత్ తిరుపతి ఆధ్వర్యంలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు అజయ్ పవార్, మేస్రం రవీందర్, ఆడే జవీందర్, సుధాకర్‌రెడ్డి, రాథోడ ప్రవీణ్, సుధారాణి, సీతారాం, సంగీత, లింగన్న, పుష్ప, స్వరూపలు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని దన్నూరు గ్రామంలో శుక్రవారం సాంఘిక అక్షరభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ తోటి ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితుడు బి.రమేష్ శర్మ విద్యార్థుల చేత అక్షరభ్యాస కార్యక్రమాన్ని గావించారు. ఇందులో 26 మంది విద్యార్థులు అక్షరాభ్యాసంలో పాల్గొన్నారు. ఎంఈవో మహమ్మద్ హుస్సేన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజు, వీడీసీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జొన్న పంటను అమ్మినట్లు చూపుతున్న రసీదు

జొన్న డబ్బులు.. ఇంకెప్పుడిస్తారు?

(5వ పేజీ తరువాయి...)

పంట డబ్బులను కూడా విడుదల చేయక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు దిక్కు లు చూస్తున్నారు. అంతేగాకుండా పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నా.. అప్పులు పుట్టడం లేదని ఆవేదనకు గురవుతున్నారు. కొంతమంది రైతులు ఇంట్లో ఉన్న నగలను తాకట్టు పెట్టి మరీ పెట్టుబడి అవసరాలను తీర్చుకుంటున్నారు. కొందరు రైతుల పరిస్థితి ఎలా ఉన్నా.. చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా మారింది. సకాలంలో విత్తనాలను విత్తితేనే ఆశించిన దిగుబడులు వస్తాయని.. లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

పిడుగు పాటు సంఘటన దురదృష్టకరం

ఉట్నూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుకు గురైన క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ డాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామంలో నలుగురు, బేల మండలంలోని సోన్నాస్, సాంగ్విడి గ్రామంలో ఇద్దరు పిడుగు పాటుతో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

కమలం పార్టీలో కయ్యం!!

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్య నేతల ఫైటింగ్
- పార్టీ పట్టణ అధ్యక్షుడిపై దాడి.. తీవ్ర గాయాలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోస్టులు

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణ బీజేపీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. గత కొద్ది రోజులుగా నేతల మధ్య వార్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోనే నేతలు ఒకరిపై ఒకరు దాడికి దిగడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ఓ కేసు విషయంలో నియోజకవర్గ స్థాయి నేత కుమారుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంద్రంత్ మహేందర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే మాట మాట పెరిగి గొడవకు దారి తీసింది. ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో గంద్రంత్ మహేందర్ చెయ్యికి తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. అయితే అక్కడే ఉన్న పలువురు నేతలు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో నేతల మధ్య సవాళ్లు.. ప్రతి సవాళ్లతో కూడిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఈ విషయమై పట్టణ సీఐ సునీల్ కుమార్‌ను వివరణ కోరగా.. రాత్రి 8 గంటల వరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు

తలమడుగు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన పిల్లలను ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. బరంపూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అమరేందర్ తన పిల్లలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర ప్రత్యూష అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.

పిల్లలను బడిలో చేర్పించిన కోఆర్డినేటర్

బోథ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిన్నింగులలో పనిచేస్తున్న కుటుంబాల వారి పిల్లలను గుర్తించి శుక్రవారం చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో ఐదు సంవత్సరాలులోపు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించామన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, భవిత పాఠశాల స్పెషల్ ఉపాధ్యాయుడు జే.భూమన్న, ఎం. భూమన్న, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్‌లు ఉన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి : బీఆర్ఎస్వీ

ఉట్నూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోజి తండా గ్రామంలో గల గురుకుల జూనియర్ కళాశాల (లాల్‌టేకిడి)లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ గతనాలుగు రోజుల కింద వర్షం గాలిదుమారం ఈదురుగాలులు రావడంతో కళాశాల ప్రాంతంలో స్తంబాలు పడి పోవడంతో కళాశాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యుత్ లేకపోవడంతో నీళ్ల రాక చాలా ఇబ్బందికి గురవుతున్నారని జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు.

బీఆర్ఎస్ మాటలకే పరిమితమైంది : ఆడె

నేరడిగొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాటలకే పరిమితమైందని, నేరడిగొండ మండలంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ప్రతీ పేదవాడికి పక్క ఇల్లు కాంగ్రెస్‌తోనే సాధ్యమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. మండలంలోని బొందిడి, మాట్లోద్ది గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం గజేందర్ శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలనే ధృడ సంకల్పంతో పని చేస్తుందని, బోథ్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే తమ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్ రావు, మాజీ సర్పంచ్ ఆడే జనార్దన్, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, రాథోడ్ మధుకర్, తుకారాం, వసంత్ రావు, రమేష్, అశోక్, ఖాజా, మార్కండేయ, రాజు నాయక్, యువ నాయకులు ఆడే సతీష్ నాయక్, ఎండీ సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండకు 'మా భూమి రథయాత్ర'

నేరడిగొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభించిన లక్ష కిలోమీటర్ల 'మా భూమి రథయాత్ర' మండల కేంద్రానికి చేరుకుంది. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను డాక్టర్ విశారదన్ మహరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వారి గ్రామాల నుంచి మండల కేంద్రంలోని పాఠశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మణ్, అంజయ్య గంగన్న లక్ష్మణ్ జయవర్ధన్ నరేందర్, పార్టీకి చెందిన మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో సతమతమవుతు ఆత్మహత్యకు యత్నించిన యువకున్ని పోలీసులు కాపాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఫైసల్ అనే యువకుడు కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ సందర్భంగా తన తండ్రికి వీడియోసందేశాన్ని పంపి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. ఆందోళనకు గురైన తండ్రి స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. స్పందించిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా బాధితుడి ఆచూకీ గుర్తు పట్టారు. భారీ వర్షంలోనే వడ్డాడి ప్రాజెక్టు వద్ద యువకున్ని గుర్తించి ప్రాణాలతో కాపాడగలిగారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి

ఉట్నూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్ సమీపంలో కరెంట్ స్తంబం వద్ద గడ్డి మేస్తున్న ఆవు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిందని బాధితుడు పెందూరు ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం పశువుల మేత కోసం వెళ్తుండగా ఆవు కరెంట్‌షాక్‌తో మృతి చెందిందని తెలిపారు. మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి డా.విజయ్‌కుమార్ పంచనామా నిర్వహించి ఆవు పొలంలో మేస్తూ కరెంట్ పోల్ యొక్క ఎర్తింగ్ వైర్‌కు తగిలి కరెంట్ షాక్‌కు గురైనట్లు నిర్ధారించారు. ఆవు మృతితో రూ.50వేల నష్టం జరిగిందని వివరించారు. తనకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

దొంగ వస్తువులను కొంటే చర్యలు : డీఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దొంగ వస్తువులను కొంటే స్క్రాప్ దుకాణాల యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు.ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 4న సమీర్‌హుస్సేన్ బొక్కల్‌గూడ, ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఖుర్షిద్‌నగర్‌కు చెందిన షేక్ ముజాహిద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. షేక్ ముజాహిద్ వద్ద గత నెలలో జరిగిన ఆకస్మిక దాడిలో ఎలక్ట్రిక్ మోటార్లు, బ్యాటరీలు, 60 మీటర్ల సర్వీస్ వైరు, 73 మీటర్ల చిన్న ఎలక్ట్రిక్ సర్వీస్ వైరు, రెండు పైపు ప్యాకెట్లు, ఇతర దొంగ వస్తువులు లభించిందన్నారు. అతనిపై ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసునమోదు చేసి గురువారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీ
మంత్రి జూపల్లిని కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు



జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి..మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావ్‌ను శుక్రవారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు మర్యాద పూర్వకంగా కలిసారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో మంత్రి జూపల్లిని వేర్వేరుగా కలిసారు. ఇన్‌చార్జీ మంత్రిగా నియమితులై సందర్భాన్ని పురస్కరించుకొని ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాలను జ్ఞాపికలుగా అందచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలిద్దరు ఇన్‌చార్జీ మంత్రి జూపల్లితో మాట్లాడి ముథోల్ నియోజక వర్గ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

● మంత్రి వివేక్‌తో భేటీ

రాష్ట్ర నూతన మంత్రివర్యులు గడ్డం వివేక్‌తో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు పలువురు నియోజకవర్గ కాంగ్రెస్ ప్రతినిదులతో వెళ్లి హైదరాబాద్‌లో మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంత్రి గడ్డం వివేక్‌ను ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్ర పటాన్ని జ్ఞాపికగా అందచేశారు.

ఇన్‌చార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆలయ చైర్మన్

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు దేవరకోట ఆలయ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి రామన్న, సాయిబాబా ఆలయ చైర్మన్ సూరజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోదరి అరవింద్, కడప శ్రీకాంత్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండల నాయకులు

లక్ష్మణచాంద, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూత న ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జూపల్లి కృష్ణారావును మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి పలు ప్రతిపాదనలను ఆయన ముందు ఉంచినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కోండ్ర నరేష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నారాగౌడ్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కోంద్రు రాంరెడ్డి, డైరెక్టర్ కిరణ్ రాగూర్, నాయకులు భీమన్న, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

లోకేశ్వరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో శుక్రవారం లోకేశ్వరం ఎంపీడీవో వెంకట్ రమేష్, లోకేశ్వరం మాజీ ఎంపీపీ లలిత భోజన్న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎంపీడీవో వెంకట్ రమేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఇళ్లు లేనటువంటి వారికి ఈ ఇందిరమ్మ ఇళ్లు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, భోజారెడ్డి, భోజారాం, సంటి రాజన్న, పిట్ట రాములు, పంచాయతీ సెక్రటరీ, కారోబార్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఎగనామం పెట్టి విందు భోజనాలకు

- పనిదినాన్ని పక్కనపెట్టి సామూహికంగా అడెల్లికి ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది
- అడెల్లిలో జోరుగా దావత్
- వాట్సాప్ స్టేటస్‌లో మెరిసిన ఎంపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లతో కూడిన ఫొటోలు
- ఖాళీగా దర్శనం ఇచ్చిన ఎంపీడీవో కార్యాలయం
- ఎంపీడీవో సహా జిల్లా అధికారులు సైతం హాజరైనట్లు ప్రచారం
- తనకు నోటి మాటగా చెప్పారని ఎటువంటి సెలవు పెట్టలేదని ఎంపీడీవో వెల్లడి
- తాను కూడా విందు భోజనానికి హాజరయ్యానని, వెళ్తే తప్పేంటని ఎదురు ప్రశ్నించిన ఎంపీడీవో



ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయం



శుక్రవారం ఉదయం 10:50 గంటలకు మేకను పట్టుకొని అడెల్లి పోచమ్మ ఆలయం ముందర సెల్ఫీ దిగుతున్న ఖానాపూర్ ఏపీవో, ఇతర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు

ఖానాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మండల స్థాయి అత్యంత కీలకమైన పాత్ర పోషించే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపీడీవో కార్యాలయం పాత్ర ఎంతో విశిష్టమైనది. అటువంటి ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది నిరక్ష్యం ఖానాపూర్ మండల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అక్కడ ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. ఇదేమని అడిగిన ప్రజలకు, పాత్రికేయులకు తాము టూర్లలో ఉన్నామని సమాధానం చెబుతున్నారు. శుక్రవారం సైతం పని వేళల్లో విధులకు ఎగనామం పెట్టి విందు భోజనాలను ఏర్పాటు చేసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఖానాపూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నం నుంచి కార్యాలయంలో అందుబాటులో లేరని చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సునీతను వివరణ కోరగా తాను కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. అధికారులు టూర్లకు వెళ్లడం, కలెక్టర్ కార్యాలయానికి మీటింగ్‌కు వెళ్తున్నామని చెప్పడం లాంటి మాటలు బాగానే ఉన్నప్పటికి అసలు విషయం మాత్రం వేరే ఉన్నట్లు బయటపడింది.

విధులకు ఎగనామం పెట్టి అడెల్లిలో దావత్

శుక్రవారం ఎటువంటి సెలవు దినం లేకపోయినప్పటికీ విధులకు ఎగనామం పెట్టి ఉపాధి హామీ ఏపీవో సహా టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతర ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అంతా కలిసి అడెల్లి పోచమ్మ సన్నిధిలో దావత్ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ విందు భోజనానికి ఖానాపూర్ ఎంపీడీవో సహా జిల్లాలోని పలువురు అధికారులు హాజరైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా విధులను పక్కనపెట్టి ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీగా కార్యాలయం

ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం అంతా ఖాళీగా కనిపించింది. కార్యాలయంలో ఇద్దరు అటెండర్లు, ఓ పంచాయతీ కార్యదర్శి మాత్రమే కనిపించారు. సదరు పంచాయతీ కార్యదర్శిని కార్యాలయ అధికారులు అంతా ఎటు వెళ్లారని ప్రశ్నించగా అంతా నిర్మల్ మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు.

అంతా నా ఇష్టం అన్నట్లుగా ఎంపీడీవో తీరు

అడెల్లి పోచమ్మ సన్నిధిలో ఉపాధి హామీ సిబ్బంది సామూహిక విందు భోజనాలు నిర్వహించడంపై ఎంపీడీవోను వివరణ కోరగా.. తనకు ఒక్కరోజు ముందు నోటి మాటగా చెప్పారని తెలిపారు. ఎటువంటి సెలవు మాత్రం అలా వెళ్లలేదని ఆమె ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. తాను మాత్రం విందు భోజనానికి హాజరు కాలేదని కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఉంటే వెళ్లినట్లు పేర్కొన్నారు. పని దినాన ఎటువంటి సెలవు పెట్టకుండా నోటి మాటతో ఉపాధి హామీ సిబ్బంది అందరికీ విందు భోజనాలకు వెళ్లేందుకు ఎంపీడీవో అనుమతి ఇవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. కాగా ఇతర రిపోర్టర్లతో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీడీవో సునీత తాను తొలత దావత్‌కు వెళ్లలేదని తెలిపిన ఆ తర్వాత తమ వద్ద ఫోటోలు ఉన్నాయని చెప్పగానే కేవలం తాను వెళ్లి భోజనం చేసి వచ్చానని వెళ్తే తప్పేంటని ఎదురు ప్రశ్నించడం కొసమెరుపు.



ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న మరో గది

పంపకాల కోసమే దావత్ అంటూ ప్రచారం

జిల్లాలో ఎండాకాలం అంతా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరిగాయి. ఖానాపూర్ మండలంలో సైతం ఉపాధి హామీ పనులు జోరుగా సాగిన నేపథ్యంలో ప్రతి ఉపాధి హామీ కూలీ వద్ద వారానికి రూ. 100 నుండి రూ. 200ల చొప్పున వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సదరు వసూలు చేసిన డబ్బులను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవో, ఎంపీడీవో సహా జిల్లాలోని ఒకరిద్దరు అధికారులు పంచుకుంటారని చెబుతున్నారు. పనులు ముగిసిన నేపథ్యంలో అడెల్లిలో విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి హామీ కూలీల నుండి వసూలు చేసిన డబ్బుల పంపకాలు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ పీడీని వివరణ కోరగా దావత్ జరిగిన విషయం తన దృష్టికి రాలేదని, పది నిమిషాలలో తెలుసుకుని పూర్తి వివరాలు చెబుతానని ఫోన్ ద్వారా తెలిపారు. అనంతరం పలుమార్లు తన నంబర్‌కు ఫోన్ చేసినా సదరు అధికారి ఫోన్ ఎత్తకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.





ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉపాధి హామీ విభాగం కార్యాలయం

మైనార్టీ స్టడీ సర్కిల్
ఉర్దూ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం ఏక్తా కమ్యూనిటీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మైనార్టీల స్టడీ సర్కిల్ స్థాపన, ఉర్దూ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు అధ్యక్షులు షేక్ ముజాహిద్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖాళీ అవుతున్న కస్బా టీఎంఆర్ బాలికల పాఠశాల చించోలి(బి) వద్ద మార్పు చేస్తున్న కారణంగా ఖాళీ అయ్యే పాఠశాల భవనాన్ని అల్ప సంఖ్యాకుల అభివృద్ధికి ఉపయోగించుకునే అవకాశాన్ని కలిగిస్తుంది. మైనార్టీల స్టడీ సర్కిల్ విద్యార్థులకు అకాడమీ సహాయం, కెరియర్ కౌన్సిలింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించవచ్చని తెలిపారు.

కళాశాలను సందర్శించిన
ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ

ముథోల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ ఎల్. భీమ్ సింగ్ సందర్శించారు. కళాశాలలో అడ్మిషన్ల పెంపు, కళాశాలలో వసతుల ఏర్పాటు, బస్సు సదుపాయం, హాస్టల్ ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, అధ్యాపకులు గంగాధర్ ప్రశాంత్, రహమాన్, సురేష్, నారాయణ్, పద్మ, స్వరూప, గణేష్, గోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నమోదు యాప్‌పై అవగాహన

ముథోల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లనమోదు యాప్ పై ఎంపీడీవో శివ కుమార్ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను టీజీహెచ్‌సీఎల్ యాప్‌లో అప్లోడ్ ప్రాసెస్ గురించి, ఇళ్ల మార్కౌట్ గురించి వివరించారు. నిబంధనల ప్రకారం ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ పాలిటి ఆశానిపాతం అనే కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించినట్లు జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న తెలిపారు.

రక్తదాత సుఖీభవ

• ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడుతున్న రక్తదాతలు
• రక్తదానంతో లాభాలంటున్న వైద్యనిపుణులు
• నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



భైంసాలో రక్తదానం చేస్తున్న యువకుడు



భైంసా ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేస్తూ..

భైంసా, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానాన్ని మించిన గొప్పదానం మరొకటి లేదు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని ఇవ్వడం ద్వారా ప్రాణదాతలుగా మారుతారు. ఈక్రమంలో రక్తదానంపై ప్రజలను చైతన్యపరచడంతో పాటు దాతల ఔదార్యాన్ని కొనియాడేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్‌లాండ్ స్టీనర్ మొదట రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన పుట్టిన జూన్ 14న ప్రపంచ రక్తదాన దినోత్సవంగా ప్రకటించి రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల పైగా కాలం నుంచి ప్రతి ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినం జరుపుకుంటున్నారు.

ఒకప్పుడు ప్రాధేయపడినా..

గతంలో అత్యవసరమని ప్రాధేయపడిన రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అత్యవసర సమయంలో రక్తం అందక అప్పట్లో చాలామంది మృత్యువాత పడుతూ వచ్చారు. ఈ క్రమంలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చినా అతి కొద్ది మంది అత్యవసర సమయంలో రక్తదానంతో వ్యక్తి ప్రాణాలు ఎలా కాపాడవచ్చో నిరూపితం చేస్తూ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. రక్తదానం మనిషి ప్రాణాలను కాపాడుతుందని, అన్ని దానాల కల్లా రక్తదానం గొప్పదనే అంశాన్ని ప్రజల మదిలో బలంగా నాటుకుపోయేలా చేశారు. రక్తదానాన్ని ఉద్యమంలా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించి ప్రాణదాతలుగా మారే బృహత్తర అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో నేడు వేలాది మంది తమ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ముందస్తుగానే బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తం నిల్వలు ఉండేలా చొరవ చూపడంతో పాటు అత్యవసర సమయంలో ఎంత దూరమైనా ప్రయాణించి రక్తదానం చేస్తున్నారు.

రక్తదానం వల్ల లాభాలు

క్రమం తప్పకుండా రక్తదానం చేయడంతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని పూర్తిగా తగ్గిస్తుందని అంటున్నారు. రక్త ప్రసరణ మెరుగుపడి బీపీ నియంత్రణలో ఉంటుంది. క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చు. బరువు తగ్గడానికి దోహదపడుతుంది. రక్తదానం చేసినప్పుడు శరీరం కోల్పోయిన రక్త కణాలను తిరిగి నింపుతుంది. ఎముక మజ్జ తాజా రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. రక్తదానం చర్మానికి మేలు చేస్తుంది. మెటిమలు, ఇతర చర్మ సంబంధిత రుగ్మతలు తొలగిపోతాయి. అన్నింటి కంటే ముఖ్యంగా రక్తదానం వల్ల ఒకరి ప్రాణం నిలబడుతుంది.

సమాచారం ఇస్తే చాలు..

రక్తం అవసరం ఏర్పడితే వెంటనే వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో సమాచారం పోస్టు చేస్తే చాలు వేలాది మంది దాతలు ముందుకు వస్తున్నారు. కొంత మంది దూర ప్రాంతాలకు సైతం వెళ్లి రక్తదానంతో ప్రాణదాతలుగా మారుతున్నారు. ఈ క్రమంలో కొన్ని సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు విశేష ఆదరణ లభిస్తోంది. చాలా మంది ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు.

18 పర్యాయాలు రక్తదానం చేశా

• గంగాప్రసాద్, వాలేగాం, భైంసా మండలం



అత్యవసర సమయాల్లో ఇప్పటి వరకు 18 పర్యాయాలు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానం. రక్తదానం పై నెలకొని ఉన్న అపోహలను తొలగించేందుకు గాను ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా చర్యలు చేపడుతున్నాను. మిత్రులను సైతం రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాను.

ప్రతీ 3 నెలలకు ఒకసారి రక్తదానం చేస్తా

• దొడ్లొల్ల సురేష్, భైంసా



నాది అత్యంత అరుదైన ఓ-నెగెటివ్ బ్లడ్ గ్రూప్. ఈ రక్తం దొరకడం చాలా అరుదు. క్షతగాత్రులు, శస్త్రచికిత్సలు అవసరమైన వారు సంప్రదిస్తే వెళ్లి, రక్తదానం చేస్తున్నాను. 3 నెలలకోసారి రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 62సార్లు రక్తదానం చేశాను. బ్లడ్ డోనర్స్ పేరిట వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి రక్తం అవసరమున్న వారికి దాతల రక్తం సమకూరుస్తున్నాను.

రక్తదానంపై అపోహలు వీడాలి

• డా. కాశీనాథ్, (ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్, భైంసా)



రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామని చాలామంది భయపడుతారు. ఇలాంటి అపోహలు వీడాలి. రక్తంలో హిమోగ్లోబిన్ 12గ్రాములకు పైన ఉన్న ప్రతీ వ్యక్తి రక్తదానం చేయవచ్చు. యువతీ, యువతులు ముందుకొచ్చి అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం బాధ్యతగా చేయాలి.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

• అత్యధికంగా నార్నూర్‌లో 39.5 మి.మీల వర్షపాతం నమోదు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో వర్షపు నీరు చేరుతుంది. శుక్రవారం ఆదిలాబాద్ అర్బన్‌తో పాటు నార్నూర్, బేల, మావల, జైనథ్, గుడిహత్నూర్ మండలాల్లో ఓ మోస్తారుస్థాయి నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నార్నూర్ మండలంలో 39.5 మి.మీల వర్షపాతం నమోదు కాగా ఆదిలాబాద్ అర్బన్‌లో 18.3 మి.మీలు, మావలలో 15.5, బేలలో 2.5, జైనథ్‌లో 2.3, గుడిహత్నూర్‌లో 1.6 మి.మీల వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పంటల సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పత్తి, సోయా విత్తనాలను విత్తడంతో ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయి. ఈ యేడు ముందస్తుగానే భారీ వర్షాలు కురిశాయి. అలాగే నైరుతి రుతుపవనాలు చురుకుగా కదలడంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు మూడు రోజుల ఆటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.





పట్టణ కేంద్రంలో ఎక్కడికక్కడ నిలిచిన నీరు



కౌటా బీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థి (ఫైల్)

వేసవి శిబిరం డబ్బుల కోసం

ఎదురుచూపులు!

• వెంటనే చెల్లించాలంటున్న విద్యావలంటీర్లు

బోథ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 33 ఉన్నత పాఠశాలలో వేసవికాలం ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహించింది. వేసవికాలంలో విద్యార్థులకు యోగా, డ్రాయింగ్, డ్యాన్స్ తదితర అంశాలపై స్వల్పకాలిక నెల రోజులపాటు శిక్షణ కల్పించింది. విద్యార్థులు ఇంటి వద్ద ఉంటే సమయాన్ని వృథా ఆస్కారని భావించి ప్రభుత్వం స్వల్పకాలికమైన శిక్షణ ఇప్పించింది. అయితే మండలానికి ఒకటి చొప్పున ఎంపికైన పాఠశాలల్లో అనుభవమున్న విద్యావాలంటీలను ఎంపికచేసి వారి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు అల్పాహారాన్ని సైతం అందించాలని సూచించడంతో ఆయా పాఠశాల ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు.

గౌరవ వేతనం కోసం ఎదురుచూపులు

మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను వాలంటీర్లు నిర్వహించారు. అయితే ఒక్కో వాలంటీర్‌కు రూ.3వేల చొప్పున ప్రభుత్వం గౌరవ వేతనంగా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వివరించారు. దీంతో ప్రధానోపాధ్యాయులు కార్యక్రమాలను సాఫీగా జరిగే విధంగా చూశారు. కార్యక్రమం పూర్తిచేసి దాదాపు 15 రోజులు కావస్తున్న ఇంతవరకు గౌరవ వేతనంతో పాటు అల్పాహారం కింద ఇచ్చిన డబ్బులు ప్రధానోపాధ్యాయులకు అందడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లా అధికారులు స్పందించాలి

ఆయా మండలాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన మాట ప్రకారం పని చేశామని వలంటీర్లు చెప్తున్నారు. అయితే శిక్షణఇచ్చి రోజులు గడుస్తున్నా తమ గౌరవ వేతనం రాకపోవడంతో వలంటీర్లు సంబంధిత ప్రధానోపాధ్యాయులను అడుగుతున్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, మంజూరు కాగానే ఇస్తామని రికొంతమంది ప్రధానోపాధ్యాయులు చెప్తుండగా.. మరికొ ందరు తమ జేబులోంచి డబ్బులు ఇచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయించారు. నిధుల మంజూరుపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి సకాలంలో నిధులు ఇప్పించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం

నర్సాపూర్ (జి), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. డీటీడీవో జే.అంబాజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్షరాభ్యాసం ద్వారా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడం, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అక్షరాభ్యాసం సందర్భంగా పాఠశాల ఆవరణ పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో ఏసీఎంవో రాథోడ్ శివాజీ, ప్రధానోపాధ్యాయుడు ముత్యం, హెచ్‌డబ్ల్యూవో ప్రేమ్‌చంద్‌తో పాటు బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, ఎంపీడీవో కే. రమేష్ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట వేణు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

8, 9, 10వ తరగతులకు

ప్యానల్ బోర్డులపైనే విద్యాబోధన

• చాక్‌పీస్, డస్టర్ వాడే అవసరమే లేదు • శిక్షణ ఇచ్చిన అధికారులు.. ఆచరణే ఆలస్యం

బోథ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు గత ఏడాది ప్యానల్ బోర్డులను సరఫరా చేసింది. అయితే ప్యానల్ బోర్డుల పైన సరైన అవగాహన లేకపోవడంతో ఉపాధ్యాయులు 8, 9, 10 తరగతులకు బోధిస్తున్న సమయంలో వాటిని వినియోగించలేకపోయారు. దీంతో ప్రభుత్వం ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించింది.

చాక్‌పీస్, డస్టర్ వాడొద్దు..

8, 9, 10వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగించే ఉపాధ్యాయులు బోర్డు పైన రాస్తున్న సమయంలో రాయడానికి చాక్‌పీస్ బోర్డులను, తుడవడానికి డస్టర్లను వాడేవారు. దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలిగేది. అయితే దీన్ని గ్రహించిన ప్రభుత్వం ఈ ఏడాది చాక్‌పీస్, డస్టర్లను వినియోగించవద్దని నిర్ణయం తీసుకుంది. చాక్‌పీస్‌ను వినియోగించి డస్టర్ ద్వారా రాతలను చెరిపివేస్తుండడంతో సూక్ష్మంగా వెలువడే దుమ్ము ధూళితో విద్యార్థులు శ్వాసకోశ వాదుల బారినపడే అవకాశం ఉందని గ్రహించిన ప్రభుత్వం పాత పద్ధతికి స్వస్తి పలకాలని సూచించింది. దీంతో ఇకపై చాక్‌పీస్, డస్టర్ వాడకుండానే విద్యాబోధన కొనసాగనుంది. ఈ విషయమై ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బోర్డులను భద్రంగా ఉంచాలి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఒక్కో బోర్డుకు 50 నుంచి రూ.70వేలు ఖర్చు చేసి సరఫరా చేసింది. అయితే విద్యాబోధనకు విద్యుత్ నుంచి అటంకం కలగకుండా ఉండేందుకుగాను ఇన్‌వెంటర్లను సైతం అందించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండడంతోపాటు ఖరీదైన ప్యానెల్ బోర్డులు చెడిపోకుండా ఉంటాయని అంటున్నారు.

ఫొటో న్యూస్



ఆసుపత్రి ఆవరణలో నిండి ఉన్న పిచ్చిమొక్కలు

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

అసలే వర్షాకాలం.. వ్యాధులు ప్రబలే కాలం.. పరిసరాల శుభ్రంగా ఉండాల్సి ఉండగా అపరిశుభ్రత తాండవిస్తోంది. రిమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్ల ఎదుట పారిశుధ్యం లోపించింది. చెత్తాచెదారంతో కంపు కొడుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ చెత్తను తొలగించకపోతే తొలుత వైద్య సిబ్బందికే వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని సిబ్బంది కోరుతున్నారు.

• ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్







ఆసుపత్రి భవనం పక్కన ఉన్న చెత్త ఇలా..

అడుగేసి చూడు..

కాలు జారకపోతే అడుగు!

జర దేఖో!!

• ఇచ్చోడ బస్టాండులో ప్రయాణికుల అవస్థలు
• అదుపు తప్పి బురదలో జారిపడి గాయాలపాలవుతున్న ప్రజలు



బస్టాండ్‌లోని బురదలో అచితూచి అడుగులేస్తున్న ప్రయాణికులు

ఇచ్చోడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ ప్రయాణ ప్రాంగణం బురదతో ప్రమాదకరంగా మారింది. నిరుపయోగంగా ఉన్న ఈ బస్టాండును ఇటీవలే వినియోగంలోకి వచ్చినా మరమ్మతులకు నోచుకోవట్లేదు. చిన్నపాటి వర్షాలకే బస్టాండు ఆవవరణ బురదమయంగా మారింది. గుంతల్లో వరద నీరు చేరింది. బస్టాండుకు వెళ్లాలంటే ఎక్కడ జారి పడతామోనని ప్రయాణికులు జంకుతున్నారు. చినుకు పడితే చాలు బస్టాండు అవరణ మొత్తం బురదమయంగా మారుతోంది. వానాకాలం బస్సుల కోసం వచ్చే ప్రయాణికులకు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులను ఏదుర్కొంటున్నారు. ప్రయాణ ప్రాంగణ ఆవరణలో అనేక చోట్ల పెద్ద గోతులు ఏర్పడడంతో ఆ వైపుగా నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కాలు తీసి కాలు వెస్తే బట్టలపై బురద చిల్లుతుందని బస్టాండ్‌కు రావాలంటేనే ఆలోచిస్తున్నారు. అవరణం తా బురదగా మారడంతో ప్రయాణికులలను బస్టాండ్‌లో దించడానికి ద్విచక్రవాహనంపై వచ్చే ప్రజలు అదుపుతప్పి బురదలోపడి ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి బురదమయమైన ప్రాయాణ ప్రాంగణంలో ఎర్రమొరం వేసి ప్రయాణికుల తిప్పలు తప్పించాలని కోరుతున్నారు.



బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన నీరు



బస్టాండ్ ఆవరణలో ఇలా..

'జొన్నల డబ్బులు వెంటనే విడుదల చేయాలి'

తాంసి: జొన్నలు అమ్మి రెండు నెలలు కావొస్తున్నా.. ప్రభుత్వం తమ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని పలువులు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రం కొనుగోలు చేసిన సహకార సొసైటీ సిబ్బందికి తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల రైతులు వినతిపత్రం సమర్పించారు. వెంటనే డబ్బులు విడుదల చేయాలని కోరారు. నెలలు గడుస్తున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. డబ్బులు వస్తే ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతాయని ఆశపడ్డామని, డబ్బులు రాకపోతే ఆందోళన చేస్తామన్నారు. రైతులు జింక లచ్చన్న, కళ్లెం గంగారెడ్డి, జింక చిన్న తాత, రాములు, సోమనారాయణ, తదితరులున్నారు.


కొనుగోలు కేంద్రానికి తరలించిన జొన్నలు(ఫైల్)

- జిల్లాలో 5.60 లక్షల క్వింటాళ్ల జొన్న కొనుగోళ్లు
- రెండు మాసాలైనా.. రైతుల ఖాతాల్లో జమ కాని డబ్బులు
- చేతిలో చిల్లి గవ్వలేక దిక్కులు చూస్తున్న అన్నదాతలు
- పంట డబ్బులను విడుదల చేయాలని ఆందోళనలు
- జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో లక్షా 9వేల ఎకరాలలో జొన్న పంట సాగు

జొన్న డబ్బులు.. ఇంకెప్పుడిస్తారు?

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అష్టకష్టాలు పడి కొనుగోలు కేంద్రాలలో జొన్న పంట దిగుబడులను అమ్ముకున్న అన్నదాతలకు ఇంకా అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం పంట డబ్బులను విడుదల చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. పంట అమ్మిన నాలుగైదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం పలుమార్లు చెప్పినా.. అది ఆచరణ సాధ్యం కావడం లేదు. ఈ యేడు యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా లక్షా 9 వేల ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారు. దీంతో మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో 5.60 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. అదేవిధంగా క్వింటాలుకు రు.3371 ధర చెల్లించి రైతుల నుంచి సేకరించారు. ఇదంతా బాగానే ఉన్నా.. అవసరానికి పంట డబ్బులు చేతికి అందకపోవడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా.. పంట డబ్బులను విడుదల చేయక పోవడంతో రైతులు ఆందోళనకు దిగు తున్నారు. ఇటీవల ఇచ్చోడ, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్, బోథ్ మండలాల్లో పలువురు రైతులు పంట డబ్బుల కోసం రోడ్డెక్కి. ఆందోళ న చేపట్టారు.



జిల్లాకు రావాల్సింది రూ.1.88 కోట్లు

జొన్న డబ్బుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ వస్తుంది. జిల్లాలో 5.60 లక్ష ల క్వింటాళ్ల జొన్నలను మార్క్‌ఫెడ్ అధికా రులు కొనుగోలు చేశారు. దీంతో జిల్లాకు రూ.1.88 కోట్ల నిధులు విడుదల కావలసి ఉంది. రెండు మాసాలు గడుస్తున్నా.. పంట డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. అధికారులను అడిగితే ఇదిగో అదిగో అంటూ కాలం వెల్లదీస్తున్నారని చెబుతున్నారు. అసలు ఎప్పుడు జమ చేస్తారో? అనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు. పంటను అమ్ముకున్నా.. పైకం రాకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ధర తక్కువైనా.. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి ఉంటే ఇప్పటికే చేతికి నగదు వచ్చి ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పెట్టుబడులకు పైసలెట్లా?

తొలకరి వర్షాల పలకరింపుతో జిల్లాలో సాగు సందడి ఊపందుకుంది. ఇప్పటికే పత్తి, సోయా, కంది పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించలేదు. అలాగే జొన్న

(తరువాయి 6వ పేజీలో...)

చాలా ఇబ్బందిగా ఉంది.. అధికారులు అర్థం చేసుకోండి!!

: గోర్డంద్ సదానంద్, రైతు, సిరికొండ మండలం

పెట్టుబడులకు చేతిలో నగదు లేక చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు అర్థం చేసుకొని జొన్న డబ్బులను వెంటనే విడుదల చేయాలి. మూడెకరాలలో జొన్న పంటను సాగు చేయగా.. 52 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గత రెండు నెలల క్రితం (ఏప్రిల్-25న) ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో జొన్నలను విక్రయించాను. ఇప్పటి వరకు జొన్న డబ్బులు ఖాతాలో జమ కాలేదు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఎలా పంటలను సాగు చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతుల ఖాతాల్లో పంట డబ్బులను జమ చేయాలి.



నిధులు విడుదల కాగానే.. జమ చేస్తాం

: ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

ప్రభుత్వం జొన్న పంట డబ్బులను విడుదల చేయగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. జిల్లాకు రూ.1.88 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో జొన్నలు అమ్మిన ప్రతీ రైతుకు మద్దతు ధరను చెల్లిస్తాం.


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో రమేష్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు : డీపీవో

నేరడిగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రమేష్ అధికారులను ఆదేశించారు. వానాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రైనేజీల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. డెంగీ, మలేరియా, అతిసార వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. క్లోరినేషన్ తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలని ఆదేశించారు. ఈనెల 19 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, అధికారులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణత సాధంచిన అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ కోసం ఉచిత శిక్షణ కోసం బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి జూలై 8 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తరగతులు జూలై 25 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 150 మంది అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కె. రాజలింగం తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయ పేర్కొన్నారు.

రేపు క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి ఎంపిక

నేరడిగొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశం కోసం మండల స్థాయి ఎంపికను ఈనెల 15న జడ్పీహెచ్ఎస్ నేరడిగొండ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాల బాలికల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాల మధ్య కాలంలో (31.08.2017) మధ్య కాలంలో జన్మించి ఉండాలని, అలాగే భౌతిక, ఆరోగ్య పరీక్షల ఆధారంగా ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యకు సంబంధించిన ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రోజారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 6, ఎంపీసీలో 12, సీఈసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. విద్యార్థుల ఫలితాల మెరిట్ ఆధారంగా ఈనెల 16వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

..మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో గల తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన ఇంటర్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సీఈసీలో 12 సీట్లలో ఎస్టీలకు ఆరు, ఓసీ ఒకటి, బీసీ ఒకటి, ఎస్సీ ఒకటి, స్పోర్ట్స్ ఒకటి, ఫిజికల్ హ్యాండిక్యాప్ ఒకటి, అనాథలకు ఒకటి చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. హెచ్ఈసీలో 17 సీట్లలో ఎస్టీలకు 11, ఓసీ ఒకటి, బీసీ ఒకటి, ఎస్సీ ఒకటి, స్పోర్ట్స్ ఒకటి, ఫిజికల్ హ్యాండిక్యాప్ ఒకటి, అనాథలకు ఒకటి సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీలు సంబంధిత సర్టిఫికెట్‌లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఈనెల 16న స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం

ఉట్నూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా రెండవ సారి బాధ్యతలు చేపట్టి శుక్రవారం ఉట్నూర్‌కు చేరుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జుపటేల్ అంచలంచెలుగా ఎదుగుతూ పార్టీ కోసం పని చేస్తునే నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించడం ఆయన పనితనానికి నిదర్శనమని దాసండ్ల ప్రభాకర్ కొనియాడారు.


ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ని సన్మానిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ దాసండ్ల ప్రభాకర్


విద్యార్థులతో ఆర్‌జేడీ సత్యనారాయణ, తదితరులు


..అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆర్‌జేడీ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణ

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల యూపీఎస్ మరాఠి మీడియం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. అంతకు ముందు సరస్వతిదేవి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచుతునే మూతబడి పోయిన పాఠశాలలను పున: ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సుజాత్‌ఖాన్, స్కూల్ హెచ్‌ఎం గణేష్, సీసీరాజేశ్వర్ తదిత

పంటలు సమృద్ధిగా పండాలని పూజలు

బోథ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో శుక్రవారం గ్రామస్థులు పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామం పొలిమేరలో ఉన్న జలపాతం వద్దకు వెళ్లి జలపాతం నీటితో రాజుల విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్లి హసేన్ హుస్సేన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఆలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జలపాతం నుంచి తీసుకొచ్చిన అభిషేకం నీటిని గ్రామస్థులకు తీర్థ ప్రసాదంగా పంపిణీ చేయడం జరిగింది. ప్రతీ సంవత్సరం మొహర్రం పండుగ కంటే 15 రోజుల ముందు ఈ వేడుకలను చేపట్టడం అనవాయితీగా వస్తుందని గ్రామస్థులు తెలిపారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇన్‌చార్జి మంత్రిని శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇన్‌చార్జి మంత్రి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

మంత్రి అడ్లూరిని కలిసిన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జూన్13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రిగా నియమితులైన అడ్లూరి లక్ష్మణ్‌ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తుంది.

మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి : ఏపీఎం

జైనథ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాలలో గల మహిళ సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాంలలో చెల్లించాలని జైనథ్ మండల ఐకేపీ ఏపీఎం నాగుల భగవండ్లు అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని కరంజి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏర్పాటు చేసిన మహిళ స్వయం సహాయక సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎన్ భగవండ్లు, మేనేజర్ సతీష్, సీసీ జి. గంగారాంలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

కుండిశేక్‌గూడ గ్రామ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వండి : సీపీఎం

ఆదిలాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నార్నూర్ మండలంలోని కుండిశేక్‌గూడ గ్రామానికి రోడ్డును నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు.ఈ మేరకు శుక్రవారం కుండిశేక్‌గూడ గ్రామస్తులతో కలిసి ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 70ఏళ్ల నుంచి కుండిశేక్‌గూడ గ్రామానికి సరైన రోడ్డు మార్గం, మంచినీటి సౌకర్యం లేక ఆదివాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన అటవి శాఖ అనుమతులు పెండింగ్‌లో ఉండడం కారణంగా పనులు చేపట్టడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు మార్గం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మానవతా దృక్పతంతో అటవి శాఖాధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి సచిన్, గాదిగూడ మండల నాయకులు కోట్నాక్ సక్కు, కుమ్రం భీంరావు, పలువురు గ్రామస్తులున్నారు.

విధుల్లో అలసత్వం వద్దు : ఇన్‌చార్జి డీఎం

ఉట్నూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థలో పని చేస్తున్న సిబ్బంది ఎలాంటి అలసత్వం చూపకుండా విధులు నిర్వహించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలు తూ.చా. తప్పకుండా పాటించాలని, జీసీసీ ఇన్‌చార్జి డివిజనల్ మేనేజర్ గుడిమల్ల సందీప్‌కుమార్ స్పష్టం చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాలతో జీసీసీ ఉమ్మడి జిల్లా మేనేజర్లు, అకౌంటెంట్లు, గోడౌన్ క్లర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన వసతి గృహాలు, పాఠశాలలు,కళాశాలలు తెర్చుకుంటున్న నేపథ్యంలో పిల్లలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, కాస్మోటిక్స్, కూరగాయాలు వెంటనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని వస్తువుల ఎక్స్‌పైరీ తేదీ స్వయంగా పరిశీలించిన తర్వాతనే సరఫరా ఏయాలని ప్రాజెక్టు అధికారి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గోడౌన్‌లలో ఉన్న రికార్డులను, రిజిస్టర్‌లను వెంటనే ఆప్‌డేట్ చేయాలని తెలిపారు. స్టాక్ వివరాలను వెంటనే డివిజన్ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని జీసీసీ సొసైటీ మేనేజర్లు, అకౌంటెంట్లు, గోడన్ క్లర్క్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



తాంసిలో తహసీల్దార్‌ను నిలదీస్తున్న కాలనీవాసులు

తాంసి భూభారతి కార్యక్రమంలో లొల్లి

తాంసి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో లొల్లి చోటు చేసుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందులో భూ సమస్యలు పరిష్కరించాలని మొదటి నుంచి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే, స్థానిక ఎస్సీ కాలనీకి సంబంధించిన మహిళలు, యువకులు మే 17న తమ సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ కాలనీలో ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు అంటూ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తానంటూ అప్పుడు స్పష్టం చేశారు. కానీ నెల రోజులు గడుస్తున్నా.. సమస్య పరిష్కరించకపోవడంతో దళిత కాలనీకి సంబంధించిన వ్యక్తులు, మహిళలు భూభారతి కార్యక్రమములో తహసీల్దార్‌ను నిలదీశారు. ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమ కాలనీ మునిగిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ.. ఎందుకు చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. కాలనీకి చెందిన మహిళలు, యువకులు, పెద్దఎత్తున హాజరై ఆందోళన చేపట్టారు. భూమిని ఆక్రమించి ఉంటున్న వ్యక్తికి ఎందుకు సహకరిస్తున్నారని? మహిళలు ప్రశ్నించారు. అయినప్పటికీ ఆమె స్పందించకపోవడంతో వారు జిల్లా కలెక్టర్‌కు, ముఖ్యమంత్రికి తమ సమస్యను వివరిస్తామని పేర్కొన్నారు. రెండు గంటల పాటు కాలనీ వాసులకు, తహసీల్దార్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు ఈ విషయమై తహసీల్దార్ స్పందించ కపోవడం గమనార్హం.

'బోథ్ గురుకులం పేరు నిలుపుతాం'

బోథ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వంద శాతం ఫలితాలను రాబట్టడాన్ని అభినందిస్తూ సేర్వోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు భీమ్రావు పాటిల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీతను అభినందించారు. మారుమూల మండలంలో ఉత్తమ ఫలితాలు రాబట్టినందుకుగాను రాష్ట్రస్థాయిలో పాఠశాల పేరు నిలపడంతో పాటు రూ.ఐదు లక్షలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతిగా తీసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాల పేరును రాష్ట్రస్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఇందులోమహార్ సంఘం జిల్లా నాయకులు మునేశ్వర, సోమన్న, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అడుగేసి చూడు..
బురద చిల్లకపోతే అడుగు!
● ఇచ్చోడ బస్టాండులో ప్రయాణికుల అవస్థలు
● బురదలో జారిపడి గాయాలపాలవుతున్న ప్రజలు
7 లో

జిల్లావ్యాప్తంగా
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
● అత్యధికంగా
నార్నూర్‌లో 39.5 మి.మీ.ల
వర్షపాతం నమోదు

